రజకులకు మెరుగైన ఉపాధి కల్పించడమే లక్ష్యం

రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రజకులకు మెరుగైన ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రజకులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మెరుగైన ఉపాధి కల్పనక ఫిషర్‌మెన్ సొసైటీలలో అవకాశం కల్పిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీల పక్షపాతి అని స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించబోతున్నారని అన్నారు. త్వరలో ట్యాంక్‌బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సైదులు, రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ చాకలి రాజు, అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శులు రాజశేఖర్, కాశీరామ్, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మంచి నీటి పైప్‌లైన్‌లను ఆధునికీకరించండి



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్

ముషీరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో అధ్వాన స్థితికి చేరుకున్న పైప్‌లైన్‌లను ఆధునికీకరించి ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరా చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి కార్పొరేటర్ మంచినీటి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ముషీరాబాద్‌లోని అజార్ గల్లీ, జెమినీ కాలనీ, బెంజిమెన్ వీధి, వైఎస్ఆర్ పార్కు వీధుల్లో మంచినీటి పైప్‌లైన్ అధ్వానంగా మారడం వల్ల కలుషిత నీరు సరఫరా అవుతున్నదని పేర్కొన్నారు.



భోలక్‌పూర్ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు

ప్రేమ ఎప్పటికీ సజీవమే...

ముషీరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రేమ ఎప్పటికీ సజీవమేనని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ డాక్టర్ వి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో వాలెంటెన్స్ డేను పురస్కరించుకుని ప్రేమ, ఆకర్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ... కాలం ఎంతమారినా, పరిస్థితులు ఎలా ఉన్నా ప్రేమకు మాత్రమే మానవ సంబంధాలను బలపర్చగల శక్తి ఉందన్నారు. నమ్మకాన్ని, అనురాగాన్ని, గౌరవాన్ని కాపాడేది ప్రేమే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు పుస్తకాలు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ అధ్యక్షురాలు హిప్నో పద్మాకమలాకర్, నాయకులు గోపాల కృష్ణ, వెంకటేశ్వర్‌రావు, కృష్ణవేణి, జయశ్రీ, శోభారాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. బాలాజీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని అంబర్‌నగర్, లలితానగర్, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30నుంచి 12, ఎల్ఎన్‌నగర్ పరిధిలోని వారాసిగూడ, అశోక్‌నగర్ నాలా, పుల్లయ్యబావి తదితర ప్రాంతాల్లో 12నుంచి 1.30 వరకు సరఫరా ఉండదన్నారు.

టీయూసీఐ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులుగా పద్మ, ప్రవీణ్



ఎస్.ఎల్.పద్మ, వి.ప్రవీణ్

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్ఎల్.పద్మ, వి.ప్రవీణ్ ఎన్నికయ్యారు. విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన ప్రథమ మహాసభలో ఈ కార్యవర్గం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా లింగంగౌడ్, నల్లన్న, సహాయ కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాస్, కేఎస్.ప్రదీప్, కోశాధికారిగా డి.లక్ష్మి ఎన్నికయ్యారు. సభ్యులుగా హన్మేష్, ఎస్.రవీందర్, ప్రభాకర్, ఆఫ్జల్, పి.నారాయణ, ఖాజామియా, మేహర్, శివరంజని, సత్యనారాయణ, విష్ణు, విజయ్, కుమార్ శ్రీనివాస్, జె.వెంకటేష్, జోగినాథ్ ఎన్నికయ్యారు.

నాగమయ్యకుంట బస్తీ అధ్యక్షుడిగా సాయిలు



రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ నాగమయ్యకుంట బస్తీ అధ్యక్షుడు కె.సాయిలు నాలుగోసారి ఘనవిజయం సాధించాడు. సోమవారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో కె.సాయిలు, శ్యామ్, ఎర్రోళ్ల సతీష్ పోటీ పడ్డారు. బస్తీలో 700 ఓట్లు ఉండగా 647 ఓట్లు పోలయ్యాయి. కె.సాయిలుకు 261, ఎర్రోళ్ల సతీష్‌కు 195, శ్యామ్‌కు 185 ఓట్లు వచ్చాయి. సాయిలు 70 ఓట్ల మెజారిటీతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి సుధాకర్ ప్రకటించారు.

ఉద్యోగం పేరుతో రూ.1.39 లక్షలు మోసం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేసి ఉద్యోగం వచ్చిందని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన యువకుడి నుంచి రూ.1.39 లక్షలు కాజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి (28) 'ఎడ్యుబ్రిడ్జ్' సంస్థలో 'ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్' కోర్సును ఆన్‌లైన్‌లో పూర్తి చేశాడు. కోర్సు పూర్తిచేసుకున్న కొద్ది రోజులకు సైబర్ నేరగాడు ఫోన్‌చేశాడు. తాను 'ఏటీఓఎస్' సంస్థ బెంగళూరు హెచ్‌ఆర్ మేనేజర్‌నని పరిచయం చేసుకున్నాడు. తమ సంస్థలో సీనియర్ అసోసియేట్ పోస్టు ఖాళీగా ఉందని.. ఆసక్తి ఉంటే ఇంటర్వ్యూకు హాజరవ్వాలని సూచించాడు. బాధితుడు అంగీకరించడంతో ఫోన్‌లోనే ఇంటర్వ్యూ చేసి సీనియర్ అసోసియేట్ ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పాడు. ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందని, ఆఫర్ లెటర్ తీసుకుంటే తప్పనిసరిగా జాయిన్ కావాలని, అందుకోసం కొంత మొత్తం సెక్యూరిటీ డిపాజిట్ కట్టాలని షరతు పెట్టాడు. మెయిల్ నుంచి ఆఫర్ లెటర్ పంపించి పలు దఫాలుగా రూ1,39,584 జమ చేయించుకున్నాడు. ఉద్యోగంలో చేరిన 15 రోజుల్లో డబ్బు ఖాతాలో జమ చేస్తారని నమ్మించాడు. జాయినింగ్ తేదీని తరచూ మార్చడం, మళ్లీ డబ్బులు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు నగర సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉద్యోగం పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే అది మోసమని గుర్తించాలని, ఎట్టి పరిస్థితుల్లో డబ్బులు పంపకూడదని సైబర్ క్రైం అధికారులు సూచించారు.

'బాపూజీనగర్‌లో మంచినీటి లీకేజీలను అరికట్టాలి'

ముషీరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో మంచినీటి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని బీజేపీ ముషీరాబాద్ అధ్యక్షుడు కంచి కుమార్‌ముదిరాజ్ పేర్కొన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం బాపూజీనగర్‌లో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ పనులను కంచి కుమార్ ముదిరాజ్ బీజేపీ నాయకులు, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి కృషిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ జన్మదినం: పుస్తకాలు, పండ్లు పంపిణీ

మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో భారీ కేక్‌లు కట్ చేశారు. మరికొన్ని బస్తీల్లో మొక్కలు నాటారు. పాఠశాలల్లో విద్యార్థులకు, ఫీవర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే గోపాల్, ముఠా జైసింహ



ఎర్రవల్లిలోని నివాసంలో మాజీ సీఎం కేసీఆర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నల్లకుంట సీనియర్ నేత విజయేంద్రసాగర్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ తమ ఇంటిలో మొక్కలు నాటాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గాంధీనగర్ డివిజన్‌జవహర్‌నగర్ కవేలిగ్రౌండ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నేతలతో కలిసి మొక్కలు నాటారు. బీఆర్ఎస్ యువనేత జైసింహ, డివిజన్ అధ్యక్షుడు ముఠా రవు రాకేష్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ మేడే దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

- చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నేత మిద్దె సురేష్ ఆధ్వర్యంలో పోటీపరీక్షల అభ్యర్థులకు పుస్తకాలను ఉచితంగా బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కవాడిగూడ: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేదలకు సూచించారు. కవాడిగూడ డివిజన్ బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి ఎన్‌డీ సాయికృష్ణ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు చౌరస్తాలోని బేక్‌జోన్ చౌరస్తాలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు ఆర్.రాంచందర్, మాజీ ప్రధానకార్యదర్శి ఆర్.రాజేష్, ప్రభాకర్, డాక్టర్ శ్రీహరి, రమేష్, ప్రవీణ్‌గౌడ్, మాణిక్యం మధు తదితరులు పాల్గొన్నారు.

- **బర్కత్‌పుర:** కాచిగూడ డివిజన్ లింగంపల్లి చౌరస్తా వద్ద గల బీఆర్ఎస్ డివిజన్ అభివృద్ధి కార్యాలయం వద్ద మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బద్దుల ఓంప్రకాష్‌యాదవ్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కట్‌చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్దుల రవీందర్ యాదవ్, ఎర్ర భీష్మదేవ్, ధాత్రిక్ నాగేందర్ బాబీ, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.
- **అంబర్‌పేట:** అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్ చౌరస్తాలో కేసీఆర్ జన్మదిన కేక్‌ను కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ తదితరులు కట్ చేశారు.
- **బర్కత్‌పుర:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు లండన్‌లోని హాక్‌బ్రిడ్జి వద్ద ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి బద్దుల శిరీష ఓంప్రకాష్‌యాదవ్ వేడుకలను నిర్వహించి మొక్కలు నాటారు.
- **రాంనగర్:** బాగ్‌అంబర్‌పేట ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా వద్ద కేక్‌ను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, నాయకులు శ్రీరాములు ముదిరాజ్ కట్ చేశారు.
- నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో రోగులకు పండ్లను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.నాగేష్ ముదిరాజ్, నాయకులు జెల్ల భిక్షపతి, గోపి, శ్రీకాంత్, నాగసాయి, సురేష్, స్వామి పంపిణీ శారు.
- **రాంనగర్:** అడిక్‌మెట్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు.

కేసీఆర్ ఫ్లెక్సీల తొలగింపును నిరసిస్తూ బీఆర్ఎస్ ధర్నా

చిక్కడపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపును నిరసిస్తూ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేశారు. అక్కడి నుంచి బీఆర్ఎస్ నేతలు హైడ్రా ఆఫీస్‌కు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సోమవారం మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆర్టీసీక్రాస్‌రోడ్‌తో పాటు ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ వారు ఫ్లెక్సీలను తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, పోలీసుల తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర యువనేత ముఠా జైసింహ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాకేష్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌ముదిరాజ్, పున్న సత్యనారాయణ, రవి, శ్యామ్‌యాదవ్, వై. శ్రీనివాస్, ప్రశాంత్, శివముదిరాజ్, ఎయిర్‌టెల్ రాజు, దీన్‌దయాళ్‌రెడ్డి, బన్ని, హన్మంతు, అరుణశ్రీ, పద్మ పాల్గొన్నారు.

'నుమాయిష్' ఆదాయంతో విద్యావ్యాప్తి: మంత్రి పొన్నం



జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): యేటా అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన నుమాయిష్ ద్వారా వస్తున్న ఆదాయాన్ని వెనకబడిన తెలంగాణ ప్రాంతాల్లో విద్యాసంస్థలు నెలకొల్పి, విద్యావ్యాప్తికి కృషిచేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషిని కొనియాడారు. సోమవారం రాత్రి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో గాంధీ సెంటనెరీ హాల్ వేదికగా 84వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన-2025 నుమాయిష్ ముగింపు ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 46 రోజులపాటు నిరవధికంగా నుమాయిష్ ఎలాంటి ఇబ్బందులు, అవరోధాలు లేకుండా ప్రశాంతంగా ముగిసిందన్నారు. అందుకు కృషి చేసిన సొసైటీ వర్గాలను ప్రత్యేకంగా అభినందించారు. యేటా నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవా కార్యక్రమం కింద విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నారన్నారు. ఇక ప్రభుత్వపరంగా కూడా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. దేశ, విదేశాల్లో మున్ముందు మరింత ఆదరణ పొందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈసారి దేశ, విదేశాల నుంచి లక్షల మంది సందర్శకులు వచ్చారన్నారు. అనంతరం ఉత్తమ స్టాళ్ల యజమానులు, అధికారులు, ఇతరులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ శివసేనారెడ్డి, తెలంగాణ మైనారిటీస్ గురుకులాల విద్యాసంస్థల సొసైటీ చైర్మన్ ఫయిమ్ ఖురేషి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు నిరంజన్, సురేందర్ రెడ్డి, డి. మోహన్, ప్రభాశంకర్, రవీయాదవ్ పలువురు పాల్గొన్నారు.

కవాడిగూడలో వీధిదీపాలకు మరమ్మతులు చేయాలి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల ప్రవీణ్ తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వెలగని వీధిదీపాలకు మరమ్మతులు చేయాలని కాంగ్రెస్ పార్టీ కవాడిగూడ డివిజన్ సీనియర్ నాయకులు ఆకుల ప్రవీణ్ జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లోని కొత్తబజార్, మజీద్‌గల్లీ, సింగాడికుంట, ముగ్గుబస్తీ, తాళ్లబస్తీ, చిత్రాలనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదన్నారు. దీంతో రాత్రి సమయాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జీహెచ్ఎంసీ ప్రధానకార్యాలయంలో జోనల్‌కమిషనర్ రవికిరణ్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ధర్మేందర్, విజయ్‌కుమార్, సతీష్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలి



జలమండలి జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో మంచినీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అధికారులను ఆదేశించారు. మంచినీటి ఎద్దడిపై సోమవారం నారాయణగూడ జలమండలి జీఎం రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు. డివిజన్‌లోని మణియార్ పట్టి, కుత్బీగూడ, వాల్మీకీనగర్, మోతీమార్కెట్, సునార్‌గల్లీ, శ్రీహనుమాన్ ఆలయం వీధి, సూరజ్‌నగర్, మౌలానాఆజాద్‌నగర్, బర్కత్‌పుర, భూమన్నగల్లీ తదితర ప్రాంతాలలో లోప్రెషర్ సమస్య ఉందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఏప్రిల్, మే లో ఎలాంటి పరిస్థితి ఉంటుందని ప్రజల ఆందోళన చెందుతున్నారని అన్నారు. వెంటనే మంచినీటి ఎద్దడిని నివారించి అన్ని ప్రాంతాలకు సమానంగా నీటి సరఫరా జరిగేట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు బల్బీర్, సుభాష్‌పటేల్, అరవింద్, వాసు, అవినాష్, జైస్వాల్, భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, ఓంప్రకాష్, బాలప్రసాద్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎంపీ ఆర్ కృష్ణయ్య



వీఆర్ఏల ధర్నాలో పాల్గొన్న ఎంపీ ఆర్ కృష్ణయ్య తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 81 ప్రకారం 61 ఏళ్ల వయస్సు పై బడిన వీఆర్ఏల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2020 సెప్టెంబర్ 9న గత ప్రభుత్వం అసెంబ్లీలో వీఆర్ఏలకు పే స్కేల్ అమలుచేస్తామని, వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, వీఆర్ఏ వారసుల జేఏసీ అధ్యక్షులు ఆంజనేయులు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని హైదరాబాద్ ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వేలాది వీఆర్ఏలు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే 70వేల ఉద్యోగాలు ఇచ్చారని, ఇవి కేవలం 3,797 మందికి ఇవ్వడం ఏమాత్రం కష్టం కాదని అన్నారు. వీఆర్ఏ వారసులు కూడా నిరుద్యోగులే కదా అని ఆయన ప్రశ్నించారు. వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం వల్ల నిరుద్యోగుల భారం తగ్గిపోతుందన్నారు. జీవో 81, 85 ప్రకారం వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో గత 15 నెలలుగా వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ ధర్నాలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, ఆంజనేయులు, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, పగిళ్ల సతీష్, రాజశేఖర్, అనిల్, మోది రామ్‌దేవ్, సతీష్, రామ్‌సాగర్, హరీష్, శ్రీను, మహమూద్, చందు, రజనీకాంత్, ఇబ్రహీం, హనుమాండ్లు, కదిర్, లింగస్వామి, రవియాదవ్, బాలయ్యతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విఆర్ఏల సంఘం నాయకులు కార్యకర్తలు ఉద్యోగులు పాల్గొన్నారు.

రంగరాజన్‌పై దాడిని ఖండించాలి : వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రమణమూర్తి

రాంనగర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చిలుకూరి బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై రామరాజ్యం స్థాపన పేరిట వీరరాఘవరెడ్డి అనే మతోన్మాది 20 మందితో కలిసి మూకుమ్మడిగా దాడిచేయడాన్ని ప్రతి పౌరుడు ఖండించాలని జై భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి, టీపీఎస్‌కే రాష్ట్ర నాయకులు జి.రాములు, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ఆవాజ్ కార్యదర్శి ఎం.డి.అబ్బాస్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి కృష్ణాజీలు పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగరాజన్‌ను బెదించడమే కాక అడ్డుగా వచ్చిన కుమారుడిపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. వీరరాఘవరెడ్డి అర్చకులకు బెదిరిస్తున్నాడని ఆరోపించారు. దీనిని మత సామరస్యం కోరే ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

భాగ్యనగరం విభిన్న సంప్రదాయాల సమాహారం



కేయికో తోనేగవాను సన్మానిస్తున్న సుధామాల, విజయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగరం విభిన్న సంప్రదాయాల సమాహారం అని వైజ్‌మెన్ అంతర్జాతీయ సేవాసంస్థల జపాన్ దేశ ప్రతినిధి కేయికో తోనేగవా అన్నారు. సోమవారం వైజ్‌మెన్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, అంతర్జాతీయ మైత్రి సంస్థ ఆధ్వర్యంలో కేయికో తోనేగవా నగరానికి విచ్చేసిన సందర్భంగా చిక్కడపల్లిలోని సంస్థల కార్యాలయంలో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో వైజ్‌మెన్ క్లబ్ అధ్యక్షురాలు సుధామాల, వి.విజయకుమార్, డా.వినయ్‌స్వరూప్, డా.ఫణీంద్ర, జీవీ.నారాయణరావు, చక్రపాణి, విద్యారణ్యస్వామి, విశ్వనాథ్, హరినాథ్‌బాబు, విశాలాక్షి, రమాదేవి, మధుమతి, లక్ష్మి, మానస తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు సెల్‌ఫోన్ల జోలికి వెళ్లొద్దు

- సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్, నిర్వాహకులు లయన్ కృష్ణారావు తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పిల్లలు సెల్‌ఫోన్ జోలికి వెళ్లకుండా చదువుపై శ్రద్ధపెట్టి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ బి.ఆనంద్ సూచించారు. సెల్‌ఫోన్‌కు బానిస అయితే జీవితం ఆగమవుతుందని చెప్పారు. విద్యార్థి దశలో సెల్‌ఫోన్ వాడాల్సిన అవసరం లేదన్నారు. తల్లిదండ్రుల సమక్షంలో వారు వాడమన్నప్పుడే వాడాలని సూచించారు. సెల్‌ఫోన్ లేని పిల్లలంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. సోమవారం వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కవాడిగూడ చిత్రాల నర్సింహులు స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ బి.ఆనంద్ ముఖ్యఅతిథిగా హాజరై వాసవీ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎల్లూరి నరేంద్రకుమార్, పాఠశాల డెవలప్‌మెంట్ కార్యదర్శి లయన్ కృష్ణారావులతో కలిసి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జీవితంలో పిల్లలకు తల్లిదండ్రులు, గురువు మాత్రమే ముఖ్యమైన వారని చెప్పారు. వారిని దాటిపోకూడదన్నారు. ఒక పోలీస్ అధికారిగా తాను అనేక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు కళాశాలలకు వెళ్లానని, ప్రభుత్వ పాఠశాలకు వచ్చే అదృష్టం ఈ రోజు దొరికిందన్నారు. ఎందుకంటే తాను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని చెప్పారు. కార్యక్రమంలో గాంధీనగర్ ఎస్ఐ నర్సింహ, హరీష్, కాచిగూడ మహిళా హాస్టల్ వైస్‌ప్రెసిడెంట్ బాదం కళావతి, వాసవీ క్లబ్ అధ్యక్షులు అనంతుల దయాకర్ ప్రధానకార్యదర్శి పబ్బ శ్రీనివాస్, కోశాధికారి ప్రదీప్‌కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ హరీష్‌కుమార్, వరకుమార్, బాదం సాయి, ప్రసాద్, జ్యోతి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి, ఉపాధ్యాయులు నాగయ్య, సుబ్రమణ్యం, సౌజన్య, కిరణ్మయి, హేమలత, అనురాధ, సుమలత, వెంకటలక్ష్మి, రజని, ఐశ్వర్య, తదితరులు పాల్గొన్నారు.

రైలులో డైమండ్ రింగు, గోల్డ్ కాయిన్ చోరీ

బర్కత్‌పుర, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి డైమండ్ రింగు, గోల్డ్ కాయిన్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... హరియాణా రాష్ట్రానికి చెందిన కంట గోయెల్(71) కుటుంబ సభ్యులతో కలిసి హజరత్ నిజాముద్దీన్‌లో కర్నాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు వస్తున్నారు. మంచిర్యాల వద్ద ఆమె హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో డైమండ్ రింగు, గోల్డ్ కాయిన్ ఉంది. 30 వేల నగదు కూడా ఉంది. గోయెల్ సోమవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మంచిర్యాల రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ప్రయాణికుల ల్యాప్‌టాప్‌ల తస్కరణ

ఇద్దరు రైలు ప్రయాణికుల ల్యాప్‌టాప్‌లను వేర్వేరు సంఘటనల్లో దొంగలు చోరీ చేశారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బోడుప్పల్‌లో నివాసం ఉంటున్న సూరజ్ పతంగి(40) కమలాపూర్‌లో వెంకటాద్రి రైల్వే ఎక్స్‌ప్రెస్ ఎక్కి కాచిగూడకు వస్తున్నారు. ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. మరో సంఘటనలో గచ్చిబౌలిలో నివాసం ఉండే పాలకొండేటి నరేష్(39) బెంగళూరులో మైసూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు వస్తున్నారు. ఉందానగర్ వద్ద ల్యాప్ టాప్ ఉన్న బ్యాగు కనిపించలేదు. ల్యాప్‌టాప్‌తో పాటు 3 వేల నగదు ఉంది. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.